


యల్లాప్రగడ సువర్చలాదేవి

# రివర్స్ మార్ట్‌గేజ్

"ఏంటి విశ్వం.. నువ్వు రివర్స్ మార్ట్‌గేజ్ లోన్ తీసుకున్నావా?" ఏదో చేయకూడని పని చేశావేంటి అని అడుగుతున్నట్టు ఆందోళనగా అడిగాడు పరమేశ్వరరావు.

"ఏం తీసుకోకూడదా? అయినా ఇందులో తప్పేముంది? నా ఇల్లుని బ్యాంక్‌కి తాకట్టు పెట్టి నెలనెలా కాస్త డబ్బు తీసుకుంటున్నాను" ఇందులో పెద్ద విషయం ఏముంది అన్నట్టు అన్నాడు విశ్వనాథం.

"ఈ వయసులో నువ్వు ఇంటిని తాకట్టు పెడితే ఎప్పటికి ఆ డబ్బుని తిరిగి కట్టి ఇల్లును విడిపించుకుంటావు?" మరింత ఆందోళన పరమేశ్వరరావు కంఠంలో కనిపించింది.

"ఇప్పుడు ఆ ఇల్లు విడిపించుకోకపోతే ఏంటి నష్టం? ఉన్నన్నాళ్లు అందులో అద్దె లేకుండా ఉండొచ్చు, పైగా బ్యాంక్ మనకు కొంత డబ్బిస్తుంది. నెల నెలా దాంతో హాయిగా గడిచిపోతుంది" తేలికగా అన్నాడు విశ్వనాథం.

"కానీ రేపు కొన్నాళ్లకు ఈ ఇల్లు విడిపించుకోవాలంటే మీ పిల్లలకి ఎంత కష్టం అవుతుందో తెలుసా?" ఈసారి నిరసనగా అన్నాడు పరమేశ్వరరావు.

"వాళ్లెందుకు విడిపించుకోవాలి?"

"అదేంటిరా అలా అంటావు. రేపు నీ తర్వాత ఈ ఇల్లు వాళ్లకే కదా చెందాలి"

"ఎందుకు చెందాలి?"

"తండ్రి ఆస్తి పిల్లలకే..."

"అలా అని శాసనం ఏమీ లేదు కదా? ఇది నా స్వార్జితం... నా ఇష్టప్రకారం చేసుకునే హక్కు నాకుంటుంది"

"కానీ పిల్లలకి మన గుర్తుగా..."

"అంటే ఏదైనా ఆస్తి ఇవ్వకపోతే వాళ్లకు మనం గుర్తుండమా? అంటే వాళ్లు గుర్తుంచుకునేది మనల్నా లేక మన ఆస్తిపాస్తులనా?"

"నీతో ఇదే పెద్ద చిక్కొచ్చింది... ప్రతిదానికి వితండవాదం చేస్తావు. అయినా సంపాదించినదేదో పిల్లకిచ్చుకోవడం లోకరీతి. పోయేటప్పుడు మనమేమీ కట్టుకుపోముగా ఈ ఆస్తిపాస్తులు..." నిరసన, బాధ, పిల్లలపై మమకారం అన్నీ ధ్వనిస్తున్నాయి పరమేశ్వరరావు మాటలలో.

"చూడు పరమేశం... అందరూ ఇలా చేశారు కనుక మనమూ ఇలానే చేయాలి అని లేదు కదా. అయినా నా స్వార్జితాన్ని నేను బ్రతికుండగా నా అవసరాలకనుగుణంగా వాడుకోవడాన్ని నువ్వు ఎలా తప్పుబడతావు. నేను ఎవరికైనా హాని చేసినా, ఇబ్బంది కలిగించినా నువ్వు నన్ను అనొచ్చు"

"ఎన్నో లక్షలు విలువచేసే ఆస్తిని బ్యాంకుకు ఇచ్చి నీ కడుపున పుట్టిన పిల్లలకు అన్యాయం చేస్తావా? ఈ ఇల్లు ఉంటే రేపు అది వారి పిల్లల అవసరాలకో, మరి దేనికైనా ఉపయోగపడుతుంది కదా"

"అప్పటి దాకా నా అవసరాలకు నేను వారి ముందు చేయి చాచాలా? మన కళ్లముందు పుట్టి పెరిగి మన దగ్గర డబ్బు తీసుకుని వారి అవసరాలు గడుపుకున్న పిల్లలు ఇప్పుడు వాళ్ల కష్టమేదో వాళ్లు పడుతుంటే నా అవసరాలకు వాళ్ల ముందు దేహీ అనమంటావా లేక డిమాండ్ చేయమంటావా?"

ఈసారి పరమేశ్వరరావు మొహం పాలిపోయింది. విశ్వనాథం చెబుతున్న మాటలు నిజంలానే అనిపిస్తున్నాయి కానీ ఎక్కడో మనసు ఒప్పుకోవడం లేదు. ఎక్కడి నుంచీ ఈ అంతరం అని అతని మనసు ఆలోచనలో పడింది. ఇద్దరూ చాలా కాలంగా మిత్రులు. కాస్త అటు, ఇటుగా రిటైరయ్యారు. రిటైరయ్యాక వచ్చిన డబ్బుని పిల్లల అవసరాలకే వినియోగించాడు పరమేశం. ఇప్పుడు వారందరూ మంచి పొజిషన్‌లోనే వున్నారు. అయితే తన ఆర్థిక అవసరాలకే డబ్బు చాలక, ఏదైనా ఉద్యోగం చేయటానికి ఓపిక లేక, పిల్లలని అడగలేక నెట్టుకొస్తున్నాడు. ఈమధ్యనే షష్టిపూర్తి జరిగిందతనికి. భేషజానికి పోయి పిల్లలని ఖర్చుపెట్టనివ్వకుండా తనే ఆ ఖర్చులు పెట్టుకుని ఆర్థిక పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసుకున్నాడు. ఎవరో ఈమధ్యనే అతనికి ఈ రివర్స్ మార్ట్‌గేజ్ లోన్ గురించి చెప్పడంతో, ఉన్న ఒక్క ఇల్లుని బ్యాంక్‌కి తాకట్టు పెట్టడమేంటీ, పిల్లలు వింటే ఎక్కడ తనని ఏమనుకుంటారో అని తనలో తానే మథనపడుతున్నప్పుడే- తన మిత్రుడు విశ్వనాథం ఈ రివర్స్ మార్ట్‌గేజ్ లోన్ తీసుకున్నాడని తెలిసి ఆశ్చర్యపోయి అతనితో మాట్లాడానికి వచ్చాడీ రోజు. మిత్రుల మధ్య ఇప్పుడు జరుగుతున్న సంభాషణ ఇదే.


ఆలోచనలో పడిన పరమేశాన్ని ఈ లోకంలోకి తెస్తూ అన్నాడు విశ్వనాథం- "చూడు పరమేశం... ఇన్నాళ్లు ఈ సిటీలో ఉద్యోగం చేసి రిటైరై ఇప్పుడు ఎక్కడకని వెళ్లమంటావు? నిన్నటిదాకా పూర్తిజీతంతో గడిపి ఇప్పుడు సగం జీతంతో గడపడం అంటే అంత తేలిక కాదు. అప్పటికీ రిటైరయ్యాక వచ్చిన డబ్బుని ఫిక్సడ్‌గా వేసినా ఆ వచ్చే వడ్డీ ఎంతవరకూ సరిపోతుంది? పెరుగుతున్న ధరలు, పెద్ద వయసు అనారోగ్య సమస్యలు, డాక్టర్లు, మందులు ఎన్నింటికని ఈ డబ్బు సరిపోతుంది? ఇవి చాలక పండగలకి, శుభకార్యాలకి పిల్లలు, మనవలు వచ్చిపోతుంటే ఉండే ఖర్చులు... వీటన్నింటికీ మనకొచ్చే పెన్షను, వడ్డీ డబ్బులు చాలకపోతే ఏం చేయాలి? నిన్నటివరకూ మన కాళ్లమీద నిలబడి, ఇప్పుడు మన సహాయ, సహకారాలతో వాళ్ల కాళ్లమీద నిలబడిన వారిని చేయి చాపి ఏమని అడుగుతాం?" విశ్వనాథం నిజాయితీగా చెబుతున్న నిత్యసత్యాలకి పరమేశం దగ్గర జవాబు లేకపోయింది. కానీ కాసేపటికి మరో ప్రశ్న మాత్రం వేయగలిగాడు.

"రేపు ఈ విషయం తెలిసి మీ పిల్లలు నీ మీద కోపం తెచ్చుకుంటే- ఈమాత్రం మేము మీకు ఇవ్వలేమా? పైగా ఊరంతా మా గురించి ఏమనుకుంటారు? తల్లిదండ్రులను చూడని వారమని మా

గురించి ఊరంతా అనుకోవాలా? అని అంటే అప్పుడు వారికేమని చెబుతావు?"

"చూడు పరమేశం... ఇక్కడ ఎవరూ ఎవరి గురించీ ఏమీ అనుకోవాల్సిన పని లేదు. ఒకరి గురించి ఇతరులు అనుకుంటారని ఆలోచిస్తే ఆ ఇతరులు అనుకంటారని ఆలోచిస్తే ఆ ఇతరులు మన అవసరాలకు ఆదుకోలేరుగా? పైగా జీవితం మొత్తం సంపాదించి ఇతరులకి పెట్టిన మనం ఇప్పుడు ఒకరి చేతి కింద ఉండడం అంటే అది మన ఆత్మగౌరవానికి భంగం కాదా?"

"డబ్బంటే బ్యాంకు దగ్గర నుంచి తీసుకున్నావ్. ఇది తమకు అవమానంగా నీ పిల్లలు భావించి నీకు దూరమైతే రేపు ఇంకా పెద్ద వయసులో నీకో మనిషి సాయం కావాలంటే ఎవరొస్తారు? చివరికి మనం పోయాక జరగాల్సినది ఎవరు చూస్తారు?"





ఒక్క క్షణం పరమేశ్వరరావు మొహంలోకి చూసి నవ్వాడు విశ్వనాథం.

"నా మొహం చూసి నవ్వుతావేంటిరా" ఇంత సీరియస్ టాపిక్ నడుస్తుంటే విశ్వనాథానికి నవ్వెలా వచ్చిందో అర్థం కాలేదు పరమేశ్వరరావుకి.

"పరమేశం, ఒక్క మాటకు జవాబు చెప్పు. మనం పుట్టక ముందు మనకేం తెలుసు?"

ఇదేం ప్రశ్న అన్నట్టు అర్థం కానట్టు చూశాడు పరమేశం. మళ్లీ నవ్వుకుని- "రేపు మనం పోయాక గురించి మాత్రం మనమెందుకు బాధపడాలి?"

"నీ అభిప్రాయంతో నేను ఏకీభవించను విశ్వం. ప్రతివారూ నీలాగా అనుకుని వుంటే మన దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరులు, ఎన్నో గొప్ప పనులు చేస్తూ సమిధలైనవారు, ఎవరెవరి కోసమో జీవితాలను త్యాగం చేసినవారూ... వీరందరూ ఎందుకు చేశారంటావు?" ఆవేశంగా అన్నాడు పరమేశం.

"వాళ్లు చేసిన దానికి ఓ అర్థముంది. కానీ నువ్వు చెప్పేది ఏంటీ? మనం సంపాదించినది మన వారసులకి ఇవ్వాలి అనే వాదనలో ఏమంత ఆదర్శం ఉంది? మనం మన పిల్లలకి ఆస్తిపాస్తులు ఇవ్వకపోవడం దేశద్రోహం ఎలా అవుతుంది? ఇది మనం వాళ్లకి చేసిన అన్యాయం ఎలా అవుతుంది? కని, పెంచి, విద్యాబుద్ధులు చెప్పించి, వారి కాళ్లపై వారిని నిలబడేలా చేసినది ఏమాత్రం లెక్కకు రాదా? కేవలం వారిని ఇబ్బంది పెట్టకుండా ఈ వయసులో మన పోషణ మనం చూసుకోవడం అంత పెద్ద నేరమా? ప్రతి వాళ్లు నీలాగా ఆలోచించబట్టే పిల్లలందరి దృష్టీ ఆ పెద్దలు ఇచ్చే ఆస్తిపాస్తులపైనే ఉంటోంది. నిజానికి తరతరాలుగా మనం అందరం చేస్తోన్న తప్పే ఇది. మనం ఒకరికి ఏమి చేసినా ప్రతిఫలాన్ని ఆశిస్తుంటాం. మన కష్టాన్ని నమ్ముకోకుండా మన పెద్దల నుంచీ మనం ఆశిస్తాం. అదే మన పిల్లలకూ అలవడుతుంది. ఏం... మనం మారమా? ఎన్నాళిలా?"

విశ్వనాథం మాటల్లో ఆవేశమే కాదు లోతైన ఆలోచన ఉందనిపించింది పరమేశానికి.


కాసేపటికి మళ్లీ విశ్వనాథమే అన్నాడు- "చిన్నప్పుడు దుఃఖభాగులు అని చదువుకున్నాం గుర్తుందా? ఈర్ష్యాళువు, జుగుప్సావంతుడు, నిత్యశంకితుడు, నిశ్శంతోషి, క్రోధనుడు, పరభాగ్యోపజీవి అని ఈ ఆరుగురూ ఎప్పుడూ బాధపడుతూ ఉంటారంటారు. నన్ను ఇప్పుడు నా పిల్లలపై ఆధారపడి

బాధపడమంటావా?"

కాసేపు వారిద్దరి మధ్య నిశ్శబ్దం తాండవమాడింది. అప్పటికే అక్కడికి వచ్చి వీరి సంభాషణ వింటోన్న శంకర్రావు మధ్యలో కల్పించుకుంటూ- "మీరిద్దరి వాదనలలో కొంత నిజం ఉంది. ఇక్కడ మనం ఏది కరెక్టు అని చెప్పలేము. కానీ ఎవరికి ఏది చేయాలనిపిస్తే వాళ్లు ఆ మార్గం ఎంచుకోవాలి. కానీ ఆమధ్య బ్యాంక్ మేనేజర్‌గా చేసి రిటైరైన మా స్నేహితుడొకరు మాట్లాడుతూ ఇండియాలో ఈ లోన్ అంతగా విజయం సాధించలేదు అని అన్నాడు. ఎందుకంటావు?" అని అడిగాడు.

"దీనికి సమాధానం కావాలంటే ముందు మీకు ఈ లోన్ గురించి పూర్తిగా తెలియాలి. అరవై ఏళ్లు పైబడి, సొంత ఇల్లు వున్నవారు తమ ఇంట్లోనే ఉంటూ ఎలాంటి అద్దె కట్టకుండా నెలకు కొంత డబ్బు పొందే పథకమే ఈ రివర్స్ మార్ట్‌గేజ్ లోన్. ఈ పథకంలో మనం మన ఇంటిని బ్యాంక్‌కి కుదువ పెడతాం. బ్యాంక్ మన ఇంటి విలువను బట్టి అరవై శాతం దాకా లోన్ ఇస్తుంది. మనం ఈ లోన్ తీసుకునే కాలపరిమితి అంటే 15 లేదా 20 ఏళ్లపాటు నెలకి ఇంత అని బ్యాంకే మనకి చెల్లిస్తుంది. ఇది అరవై ఏళ్ల వయసు పైబడిన వారికే వర్తిస్తుంది. ఉదాహరణకు మీ ఇంటి ఖరీదు 50 లక్షలైతే మీకు 30 లక్షల దాకా లోన్ వస్తుంది. అయితే మీకు 20 వేలు నెలకి చాలనుకుంటే మీరు ఓ 20 లక్షల దాకా లోన్ తీసుకుంటే సరిపోతుంది. అంతేకాక మీరు ఈ లోన్ తీసుకునే కాలంలో కూడా ఎలాంటి వడ్డీ కానీ, ఈఎంఐ కానీ చివరికి పన్ను కానీ కట్టక్కర్లేదు. పైగా ఆ ఇంటిలో మీరు ఉండొచ్చు. లోన్ తీసుకున్న కాలం పూర్తయ్యాక లోన్‌గా తీసుకున్న డబ్బును తిరిగి కట్టేసి ఇల్లు విడిపించుకోవచ్చు. లేదా బ్యాంకే ఇంటిని వేలం ద్వారా విక్రయించి వారి డబ్బు తీసుకుని మిగిలిన డబ్బుని ఇంటి యజమానికి తిరిగి ఇచ్చేస్తుంది. ఒక వేళ యజమాని చనిపోతే అతని వారసులకి ఇచ్చేస్తుంది. నిజానికి ఆలోచిస్తే పెద్ద వయసు ఉండి, సొంత ఇల్లు ఉన్నవారందరికీ ఈ పథకం ఓ వరం అని చెప్పుకోవచ్చు. అయితే దీన్ని చాలామంది అర్థం చేసుకోకపోవడం వల్లే ఈ పథకం ఇండియాలో అంతగా ప్రాచుర్యం పొందలేదు. ఇక్కడ బ్యాంకు పెద్దవారికి ఈ డబ్బు ఇస్తుంది కనుక ఇదేదో పిల్లలని కించపరిచే విషయంగా అనుకోవడం వలన ఈ లోన్‌ని తీసుకోవడానికి చాలామంది పెద్దలు సంకోచిస్తున్నారు. మనవాళ్లలో చాలామంది తమ ఇంటిని తమ కుటుంబంలో ఓ సభ్యుడుగా భావిస్తారు. అలాంటి ఇంటిని అద్దెకివ్వడానికే కొంతమంది సంశయిస్తారు. ఇక అమ్మడానికి చాలా మంది ఇష్టపడరు.

ఇక రివర్స్ మార్ట్‌గేజ్ లోన్ ప్రకారం ఇంటిని బ్యాంకుకు తాకట్టు పెట్టడం అంటే వారి దృష్టిలో ఆ ఇంటిని వదులుకోవడమే. ఎందుకంటే అన్ని సంవత్సరాలు బ్యాంక్ నుంచి డబ్బు తీసుకుని 15, 20 ఏళ్ల తర్వాత ఎవరు మాత్రం అంత డబ్బును బ్యాంకుకు కట్టి విడిపించుకోగలరు? పెద్దలు ఎటూ విడిపించుకోలేరు. ఇక పిల్లలు విడిపించడం అంటే అంత పెద్ద మొత్తం డబ్బును ఒక్కసారి ఎలా సమకూర్చుకోగలరు? అంటే దాదాపుగా ఆ ఇంటిపైనే ఆశ వదులుకున్నట్టే అని చాలామంది అభిప్రాయం. ఇక ఎంతమంది తమ తమ అయినవాళ్ల మనోభావాలకు విరుద్ధంగా ప్రవర్తించగల సాహసం చేస్తారు? పెద్దలకి, పిల్లలకి మధ్యన అంతగా సత్సంబంధాలు లేని పాశ్చాత్య దేశాలలో విజయం సాధించినట్టు ఇక్కడ సాధించడానికి మనవాళ్లు ఇంకా అంత మారలేదు. కానీ ఈ పరిస్థితి భవిష్యత్తులో మారుతుంది. ఒకప్పుడు చిన్న పిల్లల క్రచ్‌లు, పెద్దల ఓల్డేజ్ హోం లాంటివి పాశ్చాత్య దేశాలలో వుంటాయని విన్నప్పుడు కలికాలం అని అనుకున్నారు. ఇప్పుడు మన దేశంలో ఇలాంటివి ఎన్ని లేవు? అలాగే ఇవి కూడానూ. నిజానికి ఇందులో ఎవరూ ఎవరినీ తప్పు పట్టాల్సింది లేదు. ఎవరి బ్రతుకు వారు బ్రతకడం తప్పెలా అవుతుంది? ఇందులో పిల్లల్ని అవమానపరచడం అనే ఉద్దేశం ఏ పెద్దవారికీ ఉండదు, వాళ్లకు భారం కాకుండా ఉండాలన్న సదుద్దేశం తప్ప. ఏదైనా కొత్త పద్ధతికి సమాజంలో ఆమోద ముద్ర పడడానికి కొంత సమయం పడుతుంది. అందరికీ ఉపయోగపడే ఇలాంటి మంచి పథకాలకి ఎక్కువమంది ఆమోదముద్ర పడటానికి ఎంతో కాలం పట్టదని నా అభిప్రాయం" స్థిరంగా అంటోన్న విశ్వనాథం మాటలను వింటూ ఆలోచిస్తూ ఉండిపోయారు పరమేశం, శంకర్రావులు.



## 'రోబో' రాక

***'శివాజి' తర్వాత రజనీకాంత్ నటిస్తున్న 'రోబో' మీద రోజురోజుకీ అంచనాలు పెరిగిపోతున్నాయి. 2007లో శివాజి విడుదలైంది. ఇప్పటిదాకా రజనీ సినిమా రాలేదు. గత మూడేళ్లుగా నిర్మాణంలో వున్న 'రోబో' సినిమా ఈ తమిళ సంవత్సరాదికి విడుదలవుతుందని నిన్నమొన్నటి వరకూ వినిపించేది. అయితే ఇంకా సినిమాకి సంబంధించిన కొంత వర్క్ మిగిలి వుండడంతో ఆగస్టుకి గానీ విడుదలయ్యే సూచనలు లేవంటున్నారు కోలీవుడ్ జనాలు. సుమారు 125 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో నిర్మాణమవుతున్న 'రోబో' చూడాలంటే మరో అయిదారు నెలలు ఆగాల్సిందేనన్నమాట.***